# జనం

చౌదురిని 'ప్రొప్రయిటర్ బావు' అంటారు కళాసీలంతా. అట్లాంటి చౌదురి కళాసీ సుబ్బయ్యపెళ్లికి వచ్చాడు. ఆయన రాకకోసం రోడ్డుమీద ఎదురుచూస్తున్న పెద్ద మనుషులు అయిదుగురు కారు లైట్లు చూసి లేచి నుంచుని కారుని ఆపేశారు. 'నమస్కారం బాబయ్యా' అని కారుని చుట్టుముట్టారు.

ముప్పయికిలోమీటర్ల ప్రయాణమే అయినా రావటానికి చౌదురికి దాదాపు రెండు గంటలు పట్టింది. దార్లో రెండు రైల్వేగేట్లు. జాతీయ రహదారి కావటంతో ట్రక్కులూ, బస్సులూ, కార్లూ. పైగా సాయంత్రం రోడ్లమీద పశువుల మందలు. కొన్ని చోట్ల ఎదురు వాహనం తప్పుకోవాలంటే ఆగిపోవాల్సిందే.

పెళ్లి ముహూర్తానికి ముందే ఊరుచేరుకున్నందుకు చౌదురికి ఆనందంగానే ఉంది. సుబ్బయ్య నమ్మకమైన వాడు. మంచివాడు. పైగా సుబ్బయ్య మారుమనువు పెళ్లిచేసుకుంటున్నట్టు చెబితే కుతూహలం కలిగింది. పెళ్లి కూతురుకు నాలుగేళ్ల కొడుకున్నాడు. మొగుడి నించి విడాకులు తీసుకుని ఆ పిల్ల సుబ్బయ్యని చేసుకుంటున్నది. వాళ్ల కులంలో పెద్దలు చెబితే చాలు విడాకులయిపోతాయి అని

చెప్పాడు సుబ్బయ్య. కోర్టులతో పనిలేదట.

అట్లాంటి వివాహం చౌదరికి కొత్త అనిపించింది.

'పెళ్లి చేసుకుంటున్న వాడివి మారుమనువు ఎందుకు చేసుకుంటు న్నావురా సుబ్బయ్యా' అంటే 'ఈ పిల్ల మీదే మనసున్నాది' అన్నాడు.

'మరి ఆ అమ్మాయి పెళ్లికాక ముందే చేసుకోకపోయినావా?' అని అడిగితే, 'అప్పుడు అస్సామ్‌లో ఉన్నాను బావు. ఆ పిల్లకి కూడా ఆ పెళ్లి ఇష్టం లేదు. అయినా అమ్మా అయ్యా బందుగులు బలవంతాన ఆ పెళ్లి చేసేసినారు బావు' అని సమాధానం చెప్పాడు.

సుబ్బయ్య అస్సామ్‌లో టీ తోటల్లో రెండేళ్లు పనిచేశాడు. ఆ రోజుల్లోనే తండ్రికి ఒక కాలు, ఒక చెయ్యి పడిపోయాయి. దాంతో సుబ్బయ్య అక్కడ సామిల్లు ఉద్యోగం విడిచి పెట్టేసి తండ్రిని చూసుకోవాలని స్వంత ఊరు తిరిగి వచ్చేశాడు. పొరుగూళ్లోని ఆయుర్వేద వైద్యుడి చికిత్సతో, చచ్చిపోవలసిన వాడల్లా — తండ్రి బతికాడు. అదే వాడికి సంతోషం. ఊరికి దగ్గరని సుబ్బయ్య, చౌదరి దగ్గర కళాసీ ఉద్యోగంలో చేరాడు. ఆదివారం సెలవు. ఆ రోజు ఊరొచ్చి తండ్రిని చూసిపోవచ్చు. ఈ కళాసీ ఉద్యోగంలో సుబ్బయ్యకు ఉన్న సదుపాయం అది.

చౌదరి కారు దిగాడు. చుట్టూరా కొబ్బరి తోటలు. ఈ తోటల్లోంచే కారు వచ్చింది. ఊరు దూరంగా దీపాల వెల్తుర్లో కన్పిస్తున్నది. అతణ్ణి చుట్టుముట్టిన జనంలో ఇద్దరు పేంట్ కుర్రాళ్లు కూడా ఉన్నారు. మిగిలిన వాళ్లు తలపాగాల వాళ్లు. రెండేళ్ల క్రిందటయితే చౌదరి ఆ ఊళ్లో అడుగు పెట్టలేక పోయేవాడు. నక్సలైట్‌ల భయం ఉండేది. కల్లోలిత ప్రాంతంగా పేరు పడ్డది. ఇప్పటికీ ఆ భయం ఉండనే ఉంది. ఆ రోజుల్లో పెద్దపెద్ద రైతులు రాత్రుళ్లు ఇళ్లు విడిచి వేరే చోట్ల నిద్రపోయేవారట. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులోకి వచ్చింది.

అయినా చౌదరి గుండె పీకుతూనే ఉంది.

చౌదరికి తన దగ్గర పనిచేసే వాళ్లంటే ప్రేమ. తనపట్ల వాళ్లు చూపే ప్రేమ, గౌరవం, విశ్వాసం —వీటి వల్లనే, తండ్రి చనిపోయిన తర్వాత తన వ్యాపారాన్ని ఇబ్బడి ముబ్బడి చేయగలిగాడు. ఇట్లాంటి శుభకార్యాల్లో వాళ్లకు సహాయం చేసినప్పుడు వాళ్లు సంతోషపడతారు. వాళ్లకు ఆపదలు వచ్చినప్పుడు వాళ్లప్రక్కన నిలబడి ఆదుకుంటే వాళ్లు దేవుణ్ణి చూసినట్టు చూస్తారు. అంతే కాదు, వాళ్లు సంతోషంగా రెట్టింపు పని చేస్తారు. చౌదరి ఈ యాజమాన్యవిద్యను వెన్నతో పెట్టిన విద్యగా నేర్చుకున్నాడు.

డ్రైవర్ రోడ్డు వారగా ఓ చెట్టుకింద కారు ఆపాడు.

కన్ను పొడిచినా కనిపించనంత చీకటి.

ఆ వచ్చినవాళ్ల చేతుల్లో టార్చిలైట్‌లు ఉన్నాయి.

డ్రైవర్ చేతిలో కూడా టార్చిలైట్ ఉంది.

చౌదురికి తడుముకుంటున్నట్టుంది ఆ చీకట్లో నడక.

ఊళ్లో అడుగుపెడుతున్న వీధిలోనే పెళ్లిపందిరి పెట్రోమాక్స్ లైట్‌ల వెలుగులో కనబడుతున్నది.

పెళ్లికొడుకు సుబ్బయ్య, ఇంకొందరు యువకులు, ప్రొప్రయిటర్ బావుకు ఎదురొచ్చి నమస్కారాలు చేశారు. పెళ్లికొడుకు వేషంలో సుబ్బయ్య గుర్తుపట్టలేనట్టుగా ఉన్నాడు. పసుపు రాశారు. మెడలో బంగారుగొలుసు వేశారు. కొత్త బట్టలు. నుదుట ఎర్రనామం.

ప్రొప్రయిటర్ బావు స్వయానా వచ్చినందుకు అంతా మురిసి పోతున్నారు. టౌన్‌లో మిల్లులు, లారీలు, సినిమాహాలు, జీడిపప్పు వ్యాపారం ఇంకా చాలా లావాదేవీలు ఉన్న కోటీశ్వరుడు. మంచి పలుకుబడి ఉన్నవాడు. ఈ ఊళ్లోని పెద్దరైతులు సైతం ప్రొప్రయిటర్ బావు దగ్గర చేతులు ముడుచుకుని నుంచోవటం తెలిసిందే. అట్లాంటి ప్రొప్రయిటర్ బావు సుబ్బయ్య పెళ్లికి రావటం వాళ్లకు గొప్పగా ఉంది.

పెళ్లిపందిరి దగ్గర జనం సందడి సందడిగా ఉన్నారు.

పెళ్లిపందిరి పచ్చటి కొబ్బరికమ్మలతో, అరటిచెట్లతో, మామిడాకుల తోరణాలతో, ముగ్గులతో, కొత్తవెదుళ్ల వాసనలతో ముచ్చటగా ఉంది. జనం చౌదురికి నమస్కారాలు చేస్తున్నారు.

సుబ్బయ్య తండ్రి కుంటుకుంటూ వచ్చి ప్రొప్రయిటర్ బావుకి నమస్కారం చేశాడు. ఎడంకన్ను చిన్నదయింది. నోరు ఎడంప్రక్కకు ముడుచుకుపోయింది. ఎడంచేయి, ఎడంకాలు బాగా దెబ్బతిన్నట్టున్నాయి. సుబ్బయ్య మధ్య మధ్య వచ్చి, ప్రొప్రయిటర్ బావు దగ్గర తండ్రి వైద్యానికి పైసలు అడిగేవాడు. అది గుర్తొచ్చింది చౌదురికి.

ఆడవాళ్లు కళ్లరెప్పలు వాల్చకుండా చౌదురి బావుని చూస్తున్నారు. ప్రొప్రయిటర్ బావు వచ్చాడని తెలిసి ఆడవాళ్లు చూట్టానికి ఎగబడుతూనే ఉన్నారు.

పెళ్లిపందిరికి దగ్గర్లోనే విందు. బోజీ. వంట ఏర్పాట్లు ఒక ప్రక్క

జరుగుతున్నాయి. వంటలవాళ్ల కేకలు వినిపిస్తున్నాయి. ఆ వంటకాల వాసనలు నోళ్లను ఊరిస్తున్నాయి.

పెళ్లిపందిరిలో పురోహితులు పీటల ముందు కూర్చొని హడావిడిపడు తున్నారు. బాజాల వాళ్లు ఓ ఇంటి అరుగుమీద కూర్చుని ఉన్నారు.

సుబ్బయ్యనేస్తాలు అనుకోకుండా ఊరు వచ్చారు. వాళ్లు కూడా అస్సాం రంపపు మిల్లుల్లో పనిచేస్తున్న వాళ్లే. వాళ్లు దేశం చూట్టానికి వచ్చినప్పటికీ సుబ్బయ్య పెళ్లి సంగతి తెలిసి కలిసి వచ్చిందని సంతోషించారు. భిలాయ్, సీలేరు, కలకత్తాలలో ఉన్న దగ్గర బంధువులు - కొందరు వచ్చారు. వాళ్లు కూడా చౌదురిని చూసి నమస్కారాలు చేశారు.

* * *

'ఇప్పుడు సుబ్బయ్య మనిషయినాడు గాని...' అంటూ పేంట్ యువకుడు ప్రొప్రయిటర్ బావుతో ఊళ్లో బుగత కాడ కంబారితనంలో సుబ్బయ్య పడిన కష్టాలు ఒకటొకటే చెబుతున్నాడు. 'ఊళ్లో చిన్న రైతులం, బతకలేక దేశాలు పట్టి పోయినాం బావు' అని ప్రొప్రయిటర్ బావుని పొగడ్తలతో ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాడు. ఆ కుర్రవాడికి మరో ముగ్గురు పేంట్ యువకులు తోడయినారు.

'మీ కొలువులో సేరిందాకా ఆదు మనిషి కాదు బావు. అప్పుడు ఈ పెళ్లి కూతురు పిల్ల ఉన్నాదే —దాని పేరు జోగమ్మ —అది యీడిని పెళ్లాడుతానంటే — దాని అమ్మా అయ్యా కానిచ్చినారు కాదు బావు. ఆదు కంబారితనం సేస్తన్నాడని చిన్నచూపు వాళ్లకి. 'నాతోటే సుబ్బయ్య బిలాయ్ వచ్చేస్తానన్నాడు. కాని బుగత అప్పు తీరసకపోతే తల్లికీ తండ్రికీ కస్టాలు. ఆ భయంతో ఊళ్లోనే ఉండిపోయినాడు బావు. కొన్నాళ్ల తర్వాత ఆదు మనసు గట్టి చేసికొని అస్సామ్ వెళ్లిపోయినాడు. కాని ఆడి అదురుష్టం బాగులేదు. ఆడి అయ్యకి కాలూ సెయ్యీ పడిపోయినాయి. అక్కడనుండి వొచ్చేసినాడు... ఆదు అస్సామ్‌ల ఉన్న రోజుల్లో ఇప్పుడీ జోగమ్మ అయ్య ఆ పిల్లకి ఇష్టంలేని మనువు చేసేసినాడు. ఎంకన్న గొర్రెల కాసుకుంటాడు. ఆడికి సొంత గొర్రెల మంద ఉన్నాది. పెళ్లని పేరేగాని జోగమ్మ అత్తోరింటికాడ వారందినాలు కూడా ఉండలేదు బావు. తర్వాత కాపురానికే ఎల్లలేదు. కాని అప్పటికే దాని కడుపున ఒక కాయ పడిపోయింది...

ఆ ముగ్గురు పేంట్‌యువకులు చౌదురిని విశాలంగా, ఉన్నంతలో పరిశుభ్రంగా ఉన్న ఓ అరుగు మీద వాలు కుర్చీవేసి కూర్చో బెట్టారు. మర్యాదలు

కూడా వారే చూసుకుంటున్నారు. ప్రొప్రయిటర్ బావు రాత్రిపూట భోజనం చెయ్యడని పాలూ పండ్లు మాత్రమే తింటాడని సపోటా పళ్లు, అరటి పళ్లు, దానిమ్మ గింజలు, పాలూ తెచ్చిపెట్టారు. చౌదురి వాళ్ల మాటలు వింటూ పండ్లు అరాకొరా తింటున్నాడు.

వాళ్లలో ఒక యువకుడు బిలాయ్ స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడట. ఇంకో యువకుడు ఈ ఊళ్లోనే సింగిల్ టీచరట. మరో పొడుగాటి యువకుడు పోస్ట్ బంట్రోత్‌గా పనిచేస్తున్నాడట.

'బావు మా కులంల మారుమనువులున్నాయి బావు. ఇష్టం లేకపోతే విడాకులు ఇచ్చేసి మరొక మనువు చేసుకోవచ్చు బావు. ఈ జోగమ్మ విడాకులిచ్చిన మొగుడు ఇప్పుడు ఆ వంటల దగ్గరున్నాడు బావు. వాడికి వంటలొస్తాయి బావు. మంచోడే కాని ఏమిటో వాళ్ల కర్మ' అని ఆ సింగిల్ టీచర్ యువకుడు చెప్పాడు.

జోగమ్మ మొదటి భర్తని చూడాలనిపించింది చౌదురికి. ఆ సంగతే చెప్పాడు.

ఇప్పుడే తీసుకొస్తానని ఒక యువకుడు వెళ్లాడు.

* * *

తోడేలును చూసి గొర్రెలు పరుగెత్తి పారిపోయినట్టుగా చౌదురి వద్ద చేరిన ఆడవాళ్లు అక్కడ నుండి హఠాత్తుగా మాయమయ్యారు. ఏమిటా అని పరిశీలనగా చూస్తే అటునుండి ఊరుపెద్ద ఖద్దరు లాల్చీ, ఖద్దరుపంచెకట్టులో వస్తున్న దృశ్యం కనిపించింది. పైగా ఆ ఊరుపెద్ద చెయ్యెత్తు మనిషి. ఆ ఊళ్లో జనానికి అతడంటే ఎక్కడలేని ఇది. అది భయమూ కావచ్చు, లేదా మర్యాదా కావచ్చు.

అయితే చౌదురి దగ్గర కూర్చున్న యువకులు మాత్రం బెదరలేదు, చెదరలేదు. ఆ ఊరుపెద్ద దగ్గరకు వచ్చేసరికి వాళ్ల గొంతులు మాత్రం తగ్గిపోయాయి.

'పెద్ద నాయుడు బావు' అని వాళ్లల్లో ఒకడు చౌదురికి చెప్పాడు.

ఊరిపెద్ద ఆ వీధిలోనే నుంచిని 'అరె నర్సిగా, ఊరికి పెద్ద మనుషు లొస్తే ఇంటికొచ్చి చెప్పొద్దురా. వూరు పరువూ మర్యాదా యింతబేగి మర్చిపోతే మంచిది కాదురా. మీరు పట్నాలు పారిపోయి అక్కడ ఉద్యోగాలు సెయ్యొచ్చు. కాని నీ అమ్మా అయ్యా నీసెల్లీ తమ్ముడూ ఇక్కడే బతకాల. ఆ మద్దిన పొరుగూ రోడు నీ అయ్యని మక్కలిరగతన్నాడు. ఎవడడ్డమొచ్చాడ్రా. నీవు బిలాయి నుండి పొరొచ్చినావా? అడుగు, మీ అయ్యనడుగు సెప్తాడు.. ఏం మేష్టరు? ఇక్కడ సేరిపోయినావు. సౌదురి బావు వచ్చినారని ఇంటికొచ్చి సెప్పొద్దా?' అని వాళ్లని ఘాటుఘాటుగానే తిట్టి, తన అధికార దర్పాన్ని ప్రకటించుకున్నాడు ఊరి పెద్ద నాయుడు బావు.

ఆ వచ్చిన ఖద్దరు లాల్చీ పెద్ద మనిషిని పరిశీలనగా చూశాడు చౌదురి.

'బావూ, తమరొచ్చినట్టు ఇప్పుడే తెలిసింది' అని తను రావటం ఆలస్య మైనందుకు క్షమాపణ కోరుతున్న స్వరంతో, మర్యాదమన్ననలతో చౌదురిని తన ఇంటికి ఆహ్వానించాడు.

అక్కడకు తను వచ్చిన పని అయిపోయినట్టు ఇంక తిరుగు ప్రయాణం పెట్టుకుందాం అనుకుంటున్న చౌదురి అక్కడినుండి లేచాడు. అయితే ఈ పెద్ద మనిషితో వాళ్ల ఇంటికి వెళ్లాలన్న ఆలోచన మాత్రం అతడికి నచ్చలేదు.

స్వయానా ఊరు పెద్ద అక్కడకు రావటమంటే చౌదురికి ఆ ప్రాంతాల్లో ఉన్న పేరు ప్రతిష్ఠలు అర్థం చేసుకోవచ్చు. మామూలు అధికార్లో ఆఫీసర్లో అయితే మనిషిని పంపించి పిలిపించుకునేవాడు. కాని వచ్చింది చౌదురి! చౌదురికి తెలీదు గాని తనకు పరోక్షంగా సావుకారాయన.

పెద్ద నాయుడు బావు ఆ ఊరు సర్పంచిగా రెండుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికైనవాడు. పనికిరాని వెధవలందరు —తన ఇంట్లో అడుగు పెట్టటం ఇష్టం లేక తర్వాత్తర్వాత పెదనాయుడు తన మనిషి నెవర్నో ఒకర్ని సర్పంచ్‌గా ఏకగ్రీవంగా నియమిస్తుంటాడు.

అనుకోకుండా అర్ధగంట క్రిందటే ఆ నియోజక వర్గం ఎమ్మెల్యే ఒక రాజకీయవ్యవహారంలో సలహాసంప్రదింపులకోసం ఈ ఊరు వచ్చాడు, నేరుగా పెదనాయుడు దగ్గరకే. ఆ ఎమ్.ఎల్.ఏ వచ్చినప్పుడు రోడ్డుమీద కారు కనిపించి ఎవరిదా అని ఆరా తీస్తే తెలిసింది చౌదురి గురించి.

'మీరు ఊళ్లో ఉన్నట్టు తెలిసింది. ఒకసారి మన ఇంటికి వచ్చి...' అని ఆహ్వానించాడు. 'ఇప్పుడే మన ఎమ్మెల్యే గారు కూడా వచ్చారు. మీరు ఊళ్లో ఉన్నట్టు వారికి చెబితే — మిమ్మల్ని కలుసుకోవాలన్నారాయన...' అని చౌదురిని తనతో తీసుకుపోయాడు పెదనాయుడు బావు.

పెద్దనాయుడు బంగళాలో ఎమ్మెల్యే బావు, ప్రొప్రయిటర్ చౌదురి బావు ఉన్నారని ఊళ్లోని పెద్దలు, పది పదిహేను మంది వరకు వచ్చారు. వాళ్లతో చెప్పుకునే సమస్యలు వాళ్లకు చాలానే ఉన్నాయి. వాళ్లతో చేయించుకోవలసిన కార్యాలు చాలానే ఉన్నాయి. వాళ్లతో ఊరు పొందవలసిన లాభాలు కూడా చాలానే ఉన్నాయి. ఒకరికొకరు మాట తోడుగా అంతా చేరారు. మర్యాదలూ, మన్ననలూ సాగుతూనే ఉన్నాయి.

అంతలో పెళ్లి ఊరేగింపు భాజాలతో వచ్చింది. జనం ఏభై అరవై మంది వరకు ఉన్నారు. భాజాల వాళ్లు వేస్తున్న దరువుకి తగ్గట్టు యువకులు చిందులేసి ఆడుతున్నారు, పాడుతున్నారు, నవ్వుతున్నారు.

పెద్దనాయుడు బంగళా ముందు వాళ్ల ఆట పాట, బాజాల వాళ్ల దరువు ఆట చూడ సొంపుగా చాలాసేపు జరిగింది.

ఆ ఆడుతున్న యువకుల్లో చౌదురి బావు డ్రైవరుకూడా కలిసిపోయాడు.

ఆ యువకులతోపాటు ఎనిమిది తొమ్మిదేళ్ల మగపిల్లల జట్టుకూడా ఒకటి ఉంది. యువకులు ఆట ఆపినప్పుడు ఈ మగ పిల్లలు నృత్యం చేస్తున్నారు. వాళ్ల ఆట — ఆ పిలల్ల ముఖాల్లో ఆ సంతోషం చూడ ముచ్చటగా ఉంది.

పెద్ద నాయుడు బావు భార్య, కూతుళ్లు, కోడళ్లు ఊరేగింపుగా వచ్చిన పెళ్లి కొడుక్కి, పెళ్లి కూతురుకి కానుకలు ఇస్తున్నారు.

ఆ పెళ్లి ఊరేగింపులో ఆడవాళ్లే, ముఖ్యంగా పడుచువయసు ఆడవాళ్లే ఎక్కువగా ఉన్నారు. ముఖాల నిండా పసుపురాసుకుని జుత్తు ముడిలో పూలు పెట్టుకుని కొత్త బట్టలతో సంతోషపు ముఖాలతో శృంగారపు చూపులతో కళకళ లాడుతున్నారు.

పెళ్లి కూతురు జోగమ్మ వెనక ఒక నడి వయసామె జోగమ్మ నాలుగేళ్ల కొడుకుని ఎత్తుకున్న దృశ్యం ఊళ్లోవాళ్లకి వినోదంగా ఉంది. పెళ్లి ఊరేగింపు ముందుకు సాగిపోయింది.

* * *

తెల్లవారింది.

పొప్రయిటర్ చౌదురి బావుకి వీడ్కోలు చెప్పటానికి ఎమ్మెల్యేగారితో పాటు నలుగురయిదుగురు ఊరి పెద్దలు కారు దగ్గరకి వచ్చారు. అయితే కారు డ్రైవర్ మాత్రం ఇంకా రాలేదు.

కారుడ్రైవర్‌కి ముందే కబురు చేసి కారు దగ్గర ఉండమన్నారు. అయినా వాడు రాలేదు. చౌదురికి సైతం ఇబ్బందిగా ఉంది. గత రాత్రే తిరిగి ఇల్లు చేరుకోవలసింది. వేకువ జామున బయల్దేరాలనుకుంటే కుదరలేదు. ఇప్పుడు...

పగటి వెలుతురులో రకరకాల చెట్లతో ప్రకృతి అంతా పూలతోట విర బూసినట్టుగా కన్నుల పండుగ్గా ఉంది. ఎన్నెన్ని చెట్లో! ఆ చెట్లూ, వాటి కొమ్మలూ, వాటి ఆకులూ, రకరకాల ఆకారాలూ, పూలూ, కాయలూ, పండ్లూ —స్వర్గసీమ అంటే ఇదేనేమో అనిపించసాగింది. అట్లాంటి స్వర్గసీమలో పెళ్లి చేసుకున్నాడు సుబ్బయ్య.

ఆ పెళ్లికి సుబ్బయ్య పిలిస్తే తను వచ్చినట్టు లేదు. తనను డ్రైవర్ ఈ పెళ్లికి తీసుకుని వచ్చినట్టుగా ఉంది.

అంతలో పది పదిహేనుగురు యువకుల గుంపు ఊళ్లోనించి కారు వేపుగా వస్తున్నది. వాళ్లంతా సుబ్బయ్య స్నేహితులు. బిలాయ్‌లో, అస్సామ్‌లో, కలకత్తాలో పని చేసుకుని పొట్ట పోషించుకుంటున్న నిరుపేద యువకులు. రాత్రి వాళ్లంతా పెళ్లిలో, ఊరేగింపులో ఆటలతో, పాటలతో కనిపించిన వాళ్లే.

వాళ్లల్లో నాలుగేళ్ల కొడుకును ఎత్తుకుని మరీ వచ్చాడు సుబ్బయ్య.

* * *

తొలిముద్రణ 'సృజన' సాహితీ మాసపత్రిక
ఫిబ్రవరి *1972*